# ★ మీరే ఆలోచించండి

శ్రీ
రాచకొండ విశ్వనాధశాస్త్రి

ఆ సారాఫ్యాక్టరీ స్థాపించి మూడు సంవత్సరాలు కావొచ్చింది. ఇంతవరకూ నిర్విఘ్నంగా నిరంతరాయంగా సాగుతూంది. సారా తయారవుతూనే వుంది ఏడాదేడాదికి హెచ్చుగా. ఫ్యాక్టరీయజమానులు బాగుపడుతూనేఉన్నారు. సంచులు మూటకటుతూనే ఉన్నారు. కాని ఆ ఫ్యాక్టరీలో పనిచేస్తున్న యాభైమంది కూలీలసంగతీ ఆలోచించేవారులేరు. వారికష్టాలు గమనించేవారులేరు. వారిదుర్దశనిచూచి దుఃఖించేవారులేరు. వారిస్థితిని బాగుచేదామని పాటుపడేవారు లేరు. తమ అభివృద్ధికి; అభ్యుదయానికి తామే పాటుపడి యజమానులలో పోరాడాలనేవిషయం వారికింకా గ్రాహ్యం కాలేదు.

రామస్వామి ఆ ఫ్యాక్టరీలోనేపనిచేస్తున్నాడు. రోజుకి ఆరణాలచొప్పున, నెలకి పదకొండురూపాయిల నాలుగణాలూ తూచినట్లిస్తారు ఫ్యాక్టరీఅధికారులు. ఆ పదకొండురూపాయిల చిల్లరతోనే కాలం గడుపుతున్నాడు రామస్వామి. కాని రోగిష్ఠిభార్యని, వితంతుసోదరిని, ఇద్దరు పిల్లల్ని అన్నవస్త్రాదులిచ్చి పోషించడాని కాసొమ్ము చాలడంలేదనడంలో ఆశ్చర్యంలేదు. దానితో అప్పులపాలవక తప్పింది కాదు. ఫ్యాక్టరీలో పని హెచ్చు. వుదయం వెళ్లినట్లయితే తిరిగి సాయంత్రమే ఇల్లుచేరుకోవడం. ఒక్కొక్కప్పుడు రాత్రికూడా పనిచేయవలసి ఉంటుంది. ఆనాడు పనిచేయననడానికి వీలులేదు. చేయకపోయినట్లయితే ఆరోజు కూలి నెలాఖర్న జీతంలో తగ్గించేస్తారు. అసలే జీతం తక్కువ. ఆరుకాన్లుకాదుకదా, ఆరుపైసలు తగ్గించినా కష్టంగానే ఉంటుంది రామస్వామికి. అందులో ఆరణాలు కోసేసినట్లయితే వానిఅవస్థ మనం ఊహించుకోగలం. ఒకనాడురాత్రి తలపోటుపెట్టడంచేత రామస్వామి పనికివెళ్లలేకపోయాడు. మేనేజరు మర్నాడేమీ అతన్ని ప్రశ్నించలేదు. కాని జీతమిచ్చేటప్పుడు మాత్రం ఆరణాలు కోసేసేడు. సొమ్ము లెఖ్ఖపెట్టుకుని "బాబూ ఆరణాలు తక్కువ ఇచ్చేరన్నాడు రామస్వామి.

మేనేజరు కళ్లు చిట్లించి అన్నాడు.

"పదిహేనవతేదీరాత్రి డ్యూటీకి నువ్వు రాలేదు. ఎగవేసినరోజులకికూడా కూలిపుచ్చుకోవాలని చూస్తున్నావా?"

ఇది అన్యాయమనిపించింది రామస్వామికి.

"ఆనాడు పగలంతా కష్టపడి పనిచేశాను. మీరు పగలు పనిచేయడానికే కూలిఇస్తున్నారు కాని రాత్రిపనిచేయడానికి ఇవ్వలేదే. అటువంటప్పుడు రాత్రి రాకపోతేనేం?"

మేనేజరు ముఖం ఓవురించింది.

"డామిట్. కూలివెధవకూడా మాలో తర్కించడమే. రాత్రి పనిచేయమంటే చేసితీరాలి. నీకిష్టం లేకపోతే ఫో. మాకేం నష్టంలేదు.

రామస్వామి కొంచెం కోపంతో అన్నాడు.

"మీరు రాత్రికికూడా కూలిస్తే పనిచేస్తాం"

"అవతలకిపోరా గాడిదా. లేకపోతే చెప్పు తీసుకు కొట్టగలను."

అట్టేమాట్లాడితే ఉన్నపనికూడా ఊడిపోతుందని, విధిలేక, చేసేదేమీలేక, రామస్వామి బయటికి వచ్చేసేడు.

ఊరిలో మశూచిరోగం ప్రబలింది. పెద్ద సముద్రపుకెరటంలాగ ఆ భయంకరరోగం ఊరంతా వ్యాపించింది. ప్రతిగృహంలోనూ ఒకరో ఇద్దరో ఆరోగానికి ఎరయైపోతున్నారు. ఒకసారి దాని విషపూరితమైన వలలో పడినతరువాత తిరిగి సుఖంగా, జీవాలతో బయలుపడడం కష్టం.

ప్రథమంలో రామస్వామి కుటుంబస్థులకెవరికీ రోగం వ్యాపించలేదు. కాని చివరకి దురదృష్టవశాత్తు రామస్వామి రెండవకుమార్తె మశూచితో మంచమెక్కింది. రామస్వామి భయంతో గడగడలాడేడు. కుమార్తెజీవితాలపై ఆశ వదులుకున్నాడు. వైద్యుణ్ణి తీసుకురావడానికి తగినధనం లేదు. తీసుకురాకపోతే వీలులేదు. ప్రక్కఇంటివారిదగ్గర అప్పు చేయడానికి వారిస్థితి తనస్థితికంటె ఏమాత్రం మెరుగుగా లేదు. ఈవైపు ఇంట్లోఅవస్థ ఇలాగుండగా ఆవైపు ఫ్యాక్టరీకి ప్రతిదినంపోయి పనిచేయకపోతే ఇంట్లో అందరూ పస్తుండాలి. అక్కడ పనిచేస్తున్నప్పుడు, ఇంట్లో

మంచంమీద బాధతో, జ్వరంతో దొర్లుతున్న కుమార్తె వైపే అతనిమనస్సు పరుగులెత్తుతూ ఉంటుంది. అప్పటి అతనిహృదయావేదన కడుపుతీపిచేత కలిగిన దుఃఖం వర్ణనాతీతం.

పగలు పదిగంటలయింది. రామస్వామి ఫ్యాక్టరీలో పనిచేస్తున్నాడు. ఇంతలో వాని పెద్దకూతురు గబగబావచ్చి ఏడుస్తూ చెప్పింది.

"బాబా, బాబా, లక్ష్మి నిన్ను త్వరగా పిలుస్తూంది. రాబాబా."

"ఏమమ్మా చెల్లాయి కెలాగుంది?"

"ఏమో నిన్నురమ్మంటూంది. వేగంరాబాబా"

రామస్వామి కళ్లవెంబడి నీరుకారుతూంది. గద్గద స్వరంతో అన్నాడు.

"నువ్వు వెళ్లమ్మా. నేను మేనేజరుగారితో చెప్పి సెలవుపుచ్చుకొని వస్తాను.

పెద్దకూతురు వెళ్లిపోయింది. రామస్వామి మేనేజరువద్దకి వెళ్లేడు.

మేనేజరు ఆఫీసుగదిలోకూర్చుని ఏవో కాగితాలు చూచుకుంటున్నాడు. నమస్కారంచేసి వినయంగానిల్చున్న రామస్వామిని పనితొందరలోగాబోలు చూడనైనా చూడలేదు.

పదినిమిషాలయింది. పావుగంటయింది. మేనేజరింకా వంచినతల ఎత్తలేదు. రామస్వామి ఇక నూరకే ఉండలేక గొంతుక సవరించుకొని పిలిచేడు.

"బాబూ"

"..............."

"బాబూ"

మెల్లగా తలఎత్తేడు మేనేజరు.

"ఎవర్రా నువ్వు. పనిచేసుకుంటూ ఉంటే డిస్టర్బుచేయకూడదని తెలీదూ?—

"బాబూ మాలక్ష్మి నన్ను పిలుస్తూంది. మశూచితో వారంరోజులనుండి బాధపడుతూంది. అందుచేత ఇవాళ్టికి సెలవిప్పించాలండీ"

ఆలస్యం అవుతున్నకొద్దీ రామస్వామి ఆత్రత హెచ్చవుతూంది.

"నీలక్ష్మి ఎవత్తెరా? దానితో నాకేంసంబంధం లేదు. వెళ్లాలనిఉన్నట్లయితే పనిపూర్తిచేసి సాయంత్రం వెళ్లు.

"క్షమించాలండి. నాకూతురు చావుబ్రదుకుల మధ్యనుంది. నన్ను పిలుస్తూంది. నేను వెళ్లాలి" అని ఆవేదనతో అన్నాడు రామస్వామి.

"వీలులేదు. పనిచేస్తూ మధ్యను వెళ్లడానికి వీలులేదు. ఖచ్చితంగా అన్నాడు మేనేజరు. రామస్వామి విసుగెత్తిపోయేడు. అరణాలకికోసం రోజల్లా పశువుమల్లేపనిచేయడం, "విశ్రాంతి" అన్నది ఎరగకపోవడం అతన్ని విసుగెత్తించేయి. ఇప్పుడు మేనేజర్ని చూచి అన్నాడు ఉద్రేకంలో.

"మహాశయా! నీకూ, నీ ఉద్యోగానికే సెలవు. అవతల నాకూతురు చనిపోతూండగా సెలవివ్వడానికి నీకు మనసొప్పిందికాదు. నీకు కనికరమన్నది వెదకితే ఏకోశాన్నీ లేదు. ఇక నువ్వు మానవజన్మఎత్తిన లాభమేముంది? నీకు పిల్లలు లేరుగాబోలు. ఉన్నట్లయితే ఇంతనిర్దయతో ప్రవర్తించవు......"

అంతవరకూ నిర్ఘాంతపడిపోయిచూస్తున్న మేనేజరు తెలివితెచ్చుకొని గర్జించెను.

"డామిట్ గెటౌట్"

"నువ్వు మొరగనక్కర్లేదు. నేనే వెళ్లిపోతున్నా"నని సమాధానంచెప్పి రామస్వామి అక్కడనుండి కదలిపోయేడు.

రామస్వామికుమార్తె చనిపోయింది. తగిన వైద్యుడి సలహాలేకపోవడంచేతనే ఆమె చనిపోయిందని రామస్వామి విచారం. కాని విచారించి చేసేది లేదు. నాలుగుదినాలు గడచిపోయినతరువాత రామస్వామి ఉద్రేకంలో ఉద్యోగం పోగొట్టుకున్నందుకు చింతించి తిరిగి ఫ్యాక్టరీలో ఉద్యోగప్రయత్నంచేశాడు. కాని అతనివిన్నపం అధికారులు వినలేదు. తోడికూలీలతో మొరపెట్టుకున్నాడు రామస్వామి. వారికి జాలికలిగి, అతన్ని చేర్చుకుంటేనేగాని వీలులేదని సమ్మెకట్టేరు. వారంరోజులయి పనిచేయడంలేదు.

ఏమిచేసినా యజమానులకఠినహృదయం కరగలేదు. కూలీలు సమ్మె విరమించలేదు. రిజర్వుపోలీసులు రప్పించబడ్డారు. అయినప్పటికీ కూలీలు భయపడలేదు. ఫ్యాక్టరీగేటుదగ్గరనుండి కదలలేదు. కాల్పులుజరిగేయి. పదిమంది చనిపోయారు. మిగతావారు గాయపడ్డారు.

చనిపోయినవారిలో రామస్వామి ఒకడు. అతని కుటుంబానికి అతడే రక్షకుడూ, ధనమార్జించేవాడూ కూడా. ఇక నతడు చనిపోయినపిమ్మట అతనికుటుంబం ఏమికాను?

మీరే ఆలోచించండి.